
కథ



# ఈ వర్షం ఎప్పటిదో...

శివవాణి

"కుల్లం కుల్లా ప్యార్‌కరేగా హమ్‌దోనో"

వర్షం పెద్దగా పడుతోంది. చలిగా కూడా ఉంది. రోడ్డు మీద చినుకు వెయ్యిముక్కలుగా చిందు తోంది. నీటితుంపర్లు మంచుతెరలాగా వచ్చిప డుతున్నాయి. బస్టాప్‌లో షెల్టర్ కింద నుంచున్నా అంతా తడిసిపోతూనే ఉన్నారు. పాట గుండెల్లో మారుమోగుతూనే ఉంది.

ఉమబిందు, నేను రోడ్డు మీద నడుస్తూనే ఉన్నామ్. ఉమా వంకీల జుట్టు నుండి నీళ్లు కారుతూ ఉన్నాయ్.

ఆమె నవ్వుతూ ఉంటే నోట్లోకి నీళ్ళు వెళుతున్నాయ్. పెదవులు ఎర్రగా మెరుస్తున్నాయ్. షెల్టర్ కిందకు వెళదామా అన్నాను. ''ఏం వర్షం ఇష్టం లేదా?'' అంది.

''నీకు జలుబు చేస్తుందేమో!'' అన్నాను. ఆమె కిసుక్కున నవ్వింది. ''నాకిష్టమైన వాడితో మళ్ళీ ఇలా వర్షంలో తడిసే అవకాశం వస్తుందో రాదో'' అంది.

నిజమే వర్షంలో ఇలా షికార్లుచేయాలి అని ఊహించుకుంటాం. వస్తుందా వచ్చినప్పుడు కలిసి నడవడం ఎంత ఆనందం. బస్సొకటి నీళ్ళు చిమ్ముకుంటూ వెళ్లింది.

ఉమబిందు నా చేయి పట్టుకుని పక్కకు లాగింది.

బంగారువర్ణంతో ఉన్న ఆ చేయి నా చేతిని పట్టుకున్నప్పుడు ఆ చేతిలో నల్లగా ఉన్న నా చేయి అదోలా కనిపించింది. చలిలో కూడా ఆ చేతి నుండి ప్రవహించే వెచ్చదనం ఇప్పటికీ పొందుతున్నట్లే ఉంది.

వర్షం పడుతూనే ఉంది. ఒక పక్క మబ్బులు చీలిపోయి సూర్యకిరణాలు ఆతారురోడ్డు మీద వర్షం చినుకులతో ఆట మొదలెట్టాయి. చినుకులు చిందుతుంటే చిన్న చిన్న వజ్రాలు ఎగురుతున్నట్లు ఉన్నాయి ఆ నల్లని తారురోడ్డు మీద.

ఉమ భుజం నాచేతిని తాకుతోంది. ఇలా కలిసి నడవడం ఉత్సాహంగా ఉంది.

అప్పుడప్పుడు నేను ఉమ కళ్ల లోకి సూటిగా చూస్తున్నాను. ఆ కళ్లల్లో నామీద ఉన్న ప్రేమ పైకి కనిపిస్తూనే ఉంది. అప్పుడు మాత్రం ఇక ఆ కళ్లను చూడలేను. తలవంచుకుంటాను.

వీధికి రెండు ప్రక్కల ఉన్న షాపుల షెల్టర్ల క్రింద వర్షానికి చేరిన అనేక కళ్ళు చూపుల్తో మమ్మల్ని తాకుతూనే ఉన్నాయి. అలావారు చూడడం నాకు ఆనందాన్నే ఇస్తోంది.

సన్నటి నడుం, ఎత్తైన వక్షోజాలు, బలిష్టంగా ఉన్న ఊరువులు వర్షానికి తడిసి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంతటి సౌందర్యరాశి దేవతలా నడుస్తోంది. చిలిపిగా మాట్లాడుతోంది. పదేపదే నవ్వుతోంది. సిగ్గుపడడం లేదు. ఆ నవ్వు వల్ల ఉమ మరింత ఆకర్షణీయంగా కనబడుతోంది.

వర్షంలో వస్తున్న ఇద్దరు కుర్రాళ్ళు మా ఇద్దరి నడుమ దూరి ఉమను తాక్కుంటూ వెళ్లారు. నాకు కోపం ఉవ్వెత్తున లేచింది. ఉమ గమనించి పోనీయ్ అంటూ నా చేయి పట్టుకుని లాక్కుని వెళ్లింది. ఇంతటి ఆహ్లాదాన్ని కోపంతో వివాదంతో పాడుచేసుకోవడం ఇష్టం లేదు మరి.


విజయవాడలో ఉన్న కాలువలు, బ్రిడ్జిలు అందంగా ఉంటాయి. ట్రాఫిక్ లేనప్పుడు నడుస్తుంటే మహా సరదాగా ఉంటుంది. వర్షం వెలిసింది. ఇద్దరం క్రిష్ణ బ్యారేజ్ మీద నుండి నదిలోకి చూస్తున్నాం. సూర్యుడు పడమటి సంధ్యారాగం ఆలపిస్తున్నాడు. రోడ్లన్నీ స్నానం చేసినట్టు శుభ్రంగా తడితడిగా ఉన్నాయి. తడిసిన బట్టలు వంటిమీదనే ఆరుతుంటే అదోలా ఉన్నాయ్.

''బట్టలు మార్చుకుందామా వెళ్లి !'' అన్నాను.

''నన్ను వాళ్ళు రాసుకుంటూ వెళ్లినది ఇంకా మరిచిపోలేదు కదూ! వదిలేయ్! మళ్లీ ఎప్పుడు కలుస్తామో ఏమో'' అంది.

'రోజూ కలుస్తాంగా కలవకుండా ఉండడం జరుగుతుందా?' అనుకున్నాను.

నా కళ్లలోకి చూస్తూ ఉంది. ఉమా...ఈ కళ్ళు నన్ను కట్టిపడేశాయి. ఆ ఆరాధన అన్ని అలవాట్లను దూరం చేసింది. ఎడబాటుతో వచ్చిన మానసికక్లేశాలను మంత్రం వేసి తోలేశాయి. ఆ కళ్లల్లో సిగ్గును చూశాను. తృప్తిని చూశాను. వేదన కూడా చూస్తూంటాను. గదిలోకి వచ్చాం. ''ఉమా నీ ఒడిలో పడుకోవచ్చా?''అని అడిగాను.




విచిత్రంగా చూసింది. ''అంతా ఇచ్చేనుగా ఇంకా మొహమాటమా?'' అంది.

''అసలెలా బ్రతుకుతారు. ఈ మొహమాటంతోనే మనసులో ఉన్నది చెప్పుకోలేక దూరమైపోయాం. ఇక వద్దుబాబు ఈ దూరాలు వద్దు. రండి చక్కగా పిల్లాడిలా పడుకో'' ప్రేమ ఎక్కువైనప్పుడు ఏకవచన ప్రయోగం చేస్తుంది ఉమ.

నాకు తమాషాగా ఉంటుంది. నేను నా తలను ఆమె ఒడిలో ఒద్దికగా పెట్టుకున్నాను. ఆమె నావైపు చూస్తూ నా జుట్టును సరిచేస్తోంది. పొట్టలోంచి చూస్తే ఛాతీ ఎత్తులు అడ్డమై ప్రక్కకి తిరిగి చూశాను ముఖంలోకి. శూన్యంలోకి చూస్తోంది ఆమె కళ్లల్లో నీరు చేరుకుంటూ ఉంది. నేను అలానే చూస్తూనే ఉన్నాను. ఓదార్చాలా ఎలా ఎందుకు అనేవి నాకు తోచలేదు. ఆ బాధేంటో కొంత తెలుసు. కానీ తెలియనట్లే ఉండి పోతుంటాను.

''మీరు మీ భార్యతో ఇలానే ఉంటారా!'' అంది.

''మీ మనసు మంచిది ఇలానే ఉండగలరు. ప్రతిరోజు ఉంటారుగా. మరి నేనూ వయస్సులోనే ఉన్నాను. విడవకుండా ఇలాగే ఉండాలని నాకు మాత్రం ఉండదా!''

చెంపల మీద కన్నీరు తనకు అధికారమిచ్చినట్లు పాకుతోంది. నేను మాట్లాడలేదు. తను ఆవేదన పడుతోంది. ఈ బంధం ఈ సంఘటన ఇలాగే శాశ్వతం కావాలని తను అనుకుంటోంది. నాకు తెలుసు. నా మనసును నేను పరిస్థితులకు వదిలేశానేమో అనిపిస్తుంది. మనసు గంభీరంగా మారిపోతే ప్రేమ తీపి చెదిరిపోయి వేదనగా మారుతుంది అనిపించింది.

వర్షంలో తడిసిన ఆ చిలిపి పిల్ల వేరు అనిపిస్తోంది.

ఎంత తేడా ఉంది ఆనందానికి, దుఃఖానికి!

ఉమ పక్కకు జరిగి నా పక్కలో సర్దుకుని పడుకుంది. ఒక కాలు నా మీద వేసింది. తనకు నా మీద అధికారం ఉందని ఆమె చర్యలో చూపుతోంది. మా అమ్మ దగ్గర ఇలాగే పడుకుంటాను. చిన్నప్పట్నుంచీ అదే అలవాటు ఉంది.

ఆ రాత్రి నిద్రపోలేదు మేం. మధ్య మధ్యలో నా భార్యతో ఇలాంటి శారీరక సౌఖ్యపు చర్యలు గుర్తుకువస్తూనే ఉన్నాయి. ద్వంద్వంగా ఇలా ఎలా ఉండగలుగుతున్నాను.

కానీ ఉమతో ఉన్నప్పుడు ఈ దాహం తీరదు. ఎన్నిగంటలైనా ఎన్ని రోజులైనా అలసటే కనిపించదు. దూరంగా వెళ్లాల్సి వస్తుంది వదిలి అని అనిపించినప్పుడల్లా ఆమె దేహాన్ని చిలుకలా చేసి గుండెల్లో దాచుకోవాలని పదేపదే అదే ప్రయత్నం చేస్తూ ఉంటాను.

మనసులో దాచుకున్న ప్రేమను చెప్పుకోడానికి ఆడదానికి దేహమే భాషగా మారుతుంది అనిపిస్తుంది. మగవాడికి అంతేనేమో తెలియదు మరి. నేను ఎప్పుడూ ఎక్కువ మాట్లాడలేను కొన్నాళ్ళ క్రితం.

నాకు పెళ్ళయిన మర్నాడు ఉమ వాళ్ల అమ్మ వచ్చి ఏడ్చింది. ఉమ చావుబతుకుల్లో ఉంది కాపాడమని.

''ఎందుకు అన్నం నీళ్ళు మానేశావుట'' అన్నాను.

ఏడుస్తోంది మధ్యలో సిగ్గుగా తలపక్కకు తప్పి నవ్వింది.

చాలా నీరసంగా కనిపించింది. ''వారంరోజులు ఇలా చేయడం ఏంటి?''

''నువ్వెందుకు పెళ్లి చేసుకున్నావ్ అందుకే'' అంది.

అర్థమయింది నాకు. ''మరి నాకెందుకు చెప్పలేదు చేసుకోవద్దని'' అన్నాను.

''నేనెవర్నని? నాకెందుకు? ఏదో ప్రేమించాను. నువ్వు పరాయివాడివి అవుతున్నావంటే ఇక చచ్చిపోవాలని అనిపించింది. అంతే!''

ఆమెను విడిచి వుండలేనని నాకు తెలుసు. కానీ మేము నా పెళ్లికి ముందే ఎందుకు మనసు విప్పుకోలేదో అది అర్థంకాని విషయం.

''వచ్చానుగా ఇక లే. కొద్దిగా తిను. కాస్త నిమ్మరసం తాగు''

''మళ్ళీ వెళ్లిపోతారుగా'' అంది.

''వెళ్లను. ముందు నువ్వు కుదుటపడాలి'' అన్నాను.

''అంతా అయిపోయిందా''

''అంటే?''

''శోభనం''

''ముహూర్తం లేదంట''

అంతే రివ్వున పెనవేసుకుపోయింది. ఎన్నాళ్ళు దాచిందో ఈ ప్రేమ. ఇన్ని ఉపవాసాలు చేసింది నాకోసం. ఏమిటో ఈ ఆడవారి మనస్తత్వం. ఇప్పుడు మానసికంగానే కాదు శరీరాలు కూడా విడిగా ఉండడం భరించలేనట్లుగా ఉంది. మూడు ముళ్ళు ఆడవాళ్ళని బంధిస్తాయేమో గానీ మగవాళ్లని కాదని అప్పుడు నాకనిపించింది. మా ఇద్దరి బ్రహ్మచర్యం భగ్గున ఆవిరైపోయింది.

గతంలా ఇది స్నేహం మాత్రం కాదు. నేను పిలిచినప్పుడు వస్తూ ఉండాలి లేకపోతే నిరాహారదీక్ష చేసి చచ్చిపోతాను అంది.

జీవనయానానికి మనసులోని భావాలకు ఎప్పుడూ లంగరు కుదరదు. బ్రతుకు తెరువు అనేది ఒక తెరచాప అది నడిపిస్తూ ఉంటుంది. గాలి అనుకూలంగా ఉండాలి.


ప్రతికూల పవనాలు మనసును ఒక పక్కకు లాగేయడం చూశాను. ఉమ అనిల్‌ను పెళ్లి చేసుకుంటుందని విన్నాను. తెలియక ఆరోజే బంగారపు కొట్టుకు వెళ్లి తాళిబొట్టు తెచ్చాను.

ఉమకు గుళ్ళో కడదామని మనసులో అంతరాంతరాళాల్లో ఎక్కడో జారిపోతోందని అనుమానం వచ్చినప్పుడే కొద్దిగా బలవంతపు నమ్మకాన్ని పోగేసుకోవాలని అనిపిస్తుంది. అటువంటిదే ఈ తాళిబొట్టు తంతూను.

ఈ విషయాన్ని గుండె ఎవరో పిండి చేస్తున్నట్లనిపించింది. తాళిబొట్టు కృష్ణానదిలోకి గిరాటువేశాను.

ఒకరోజు వచ్చి ''అశోకవనంలోకి సీతలాగా వెళ్లిపోతున్నాను నాకూ సంసారం అంటూ ఉండాలిగా నన్ను దీవించండి'' అంది. కనిపించగానే ఒక్క క్షణం కూడా వియోగం భరించలేక గుండెలకు హత్తుకునేవాడిని. కౌగిలిలో ఒదిగిపోయే ఉమ ఇప్పుడు దీవించమంటూ కాళ్ల దగ్గర కూర్చుంది''

మగవాళ్ళు కూడా భయంకరంగా ఏడ్వగలరు. అది నా స్వానుభవం.




దుఃఖం ఆపుకోలేకపోయాను. పసిపిల్లాడిలా ఏడ్చాను. ఓదార్చే ఆ ఒడి ఇక దూరమైపోతుంది. సినిమాలోలా ఒక్కడ్నే గదిలో కూర్చుని పిచ్చిపిచ్చి పాటలు పాడుకున్నాను.

సంసారం. పుట్టుకొచ్చిన పిల్లలు, వారికోసం సంపాదన ఇదంతా కూడా ఏదో భ్రమలాగా మాసిపోయే కలలాగా అనిపిస్తోంది.

నా భార్య నాలో స్నేహితుడి కోసం వెతికింది దొరకలేదు కాబోలు బయట వెతుక్కుంది. తాను చాలా అందగత్తె అట నేను నిర్లక్ష్యం చేశాను అంది. వెళ్లిపోతానంది. నేనేమీ మాట్లాడలేదు. పిల్లలు హాస్టల్లో చదువుకుంటున్నారు. పాప పేరు ఉమ.

''పూర్వంలాలేదు మనస్సును కుళ్ళబొడిచే కుళ్లంతా సర్వత్రా వ్యాపించిపోతోంది. మనుషులు గుంపులుగా విడిపోతున్నారు. చాలా అసహ్యంగా కులసంఘాలు పెట్టుకుంటున్నారు. ప్రేమ అనురాగాలు మృగ్యమైపోతున్నాయి.''

సాహితీ సంఘం వారి సన్మానసభలో మాట్లాడుతుంటే ప్రేక్షకుల్లో కొందరు నా మాటలు విచిత్రంగా వింటున్నారు. ఎప్పుడూ వినే విషయాలలా అంతర్మథనంలో ఎప్పుడూ ఉన్న సాహితీ స్రవంతే అది. వాస్తవాలకి భిన్నంగా ఎప్పుడూ ఉండదు.

మనుషులు వాస్తవం తెలిసి బ్రతకడం లేదు కనుక నా మాటలు వారికి విచిత్రంగా అనిపించి ఉండవచ్చు. ఆ సభలో నన్ను గతంలో కట్టిపడేసిన కళ్ళు, ఇప్పటికి అంతరాత్మగా నాలో మసలుతున్న ఆ కళ్ళు నా వైపు చూస్తూ కనిపించాయి. దూరాలు కొలతలతో చెప్పగలం గానీ మనస్సులు ఎక్కడున్నా అక్కడే పెనవేసుకునే ఉంటాయి. దూరమెక్కడ నా ఉపన్యాసధోరణి మారడం గమనించాను.

ఉమ ఎక్కడ ఉంది? ఏం చేస్తోంది? ఎలా ఉంది? అనే తర్కం నామనసుకు కలగలేదు. వేదనాభారం నిండి ఉంది వేరే ఆలోచనకు అవకాశమేది?

ఆ రాత్రి ఇప్పటికి కొన్నిరోజుల క్రితం ఉమ వచ్చింది. ఒక్కడ్నే ఉన్నాను. ఎలాంటి వింత అనుభూతులూ నన్ను కదిలించలేదు.

అంతా మామూలుగానే కొన్ని సంవత్సరాల క్రితం లాగానే అప్పటి వర్షంలోలాగానే నిరాహరదీక్షలు చేసిన రాత్రిలాగానే ఈమధ్యలో ఏమీ జరుగనట్టే నా మనసుకు అనిపించింది.

బయట జోరున వర్షం. ఉమ అలాగే నిలబడి ఉంది. నా గది గుమ్మంలో ఇన్ని సంవత్సరాల ఎడబాటు దూరం ఆమెను అలా నిలబెట్టేశాయి.

''నేను వచ్చాను. అంతా వదిలేసుకుని వచ్చాను'' అంది. నేను నా చూపులతో ఉమ కళ్లలో భావాన్ని వెతుక్కుంటున్నాను. ''నన్ను పిలవరా?'' అంది.

నేను మాట్లాడలేదు నా చేతులు అప్రయత్నంగానే ఆమెను ఆహ్వానించాయి. నా కౌగిలిలో ఒడిలో ఒదిగిపోయింది.

ఎందుకో మళ్ళీ నాకు ఏడ్పువచ్చింది. నిరాశ, ఒంటరితనం మెరుపుల్లా తప్పుకుంటున్నాయి.

''మన గురించి అనిల్‌కు తెలుసు'' అంది.

''నా మనస్సంతా తూట్లు పొడిచాడు. ప్రతి క్షణం మరచిపోతున్న నీ జ్ఞాపకాల్ని తవ్వుతూ ఉండేవాడు''

''ఎందుకు వెళ్లిపోయావు నన్నొదిలి'' అన్నాను.

''అసూయ, బాధ. నీకు లాగానే నాకు సంసారం కావాలి. నాకూ మాతృస్థానం లభించాలి అని గూడు అల్లుకున్నాను. ఆ గూడు నా స్వంతం నాది. కానీ అనిల్ దాన్లో ఉండడానికి పనికిరాడు'' అంది.

ఎప్పుడూ అడగనిమాట అడిగాను. ''నాతోనే ఉంటావా?''

''ఉంటాను. ఇక విడిపోవద్దు. కలిసే ఉందాం'' అని పసిపిల్లలా ముఖం నా గుండెల్లో దాచుకుంది.

ఎప్పటిలాగానే తెల్లారింది వర్షం పడుతూనే ఉంది. ఈ వర్షం ఎప్పటిదో కొన్నివేల లక్షల కోట్ల సంవత్సరాల నుండి వర్షిస్తూనే ఉంది. అనుభూతులు పంచుకుంటున్న మనుషులు మాత్రమే మారుతున్నారు.

ఉమకోసం వెతికాను గదిలో లేదు. ఒక్కసారి మనసును శూన్యం ఆవరించింది.

కలలాంటి ఈ జీవితంలో ఉమ రాక కూడా ఒక వాస్తవస్వప్నం.

చీటీతో ఒక చిన్నపిల్లాడు గుమ్మంలో ఉన్నాడు.

ఆ వర్షం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది ఉమ. ఆ చీటీలో వర్తమానం ఆ భయంకర సత్యం మాత్రమే.

ఆ చిన్నపిల్లవాడి కన్నుల్లో ఉమ చూపులు నన్ను తాకుతున్నట్లు గగుర్పాటు కలిగింది.

★